క్లుప్తంగా

వేసవికాలం అప్రమత్తంగా ఉండండి

డీఎంహెచ్ఓ రవి



క్రోసూరు: వేసవి కాలం పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ రవి కోరారు. శుక్రవారం ఫ్రై డే డ్రై డే సందర్భంగా సాధారణ తనిఖీల్లో భాగంగా క్రోసూరు పీహెచ్‌సీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడారు. రానున్న వేసవి కాలంలో ప్రజలు ఎక్కువగా డయేరియాకు గురవుతుంటారని, కాబట్టి ఏ గ్రామంలో కూడా ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణమే స్పందించి వైద్య సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే భాగంగా మురుగు కాలువల్లో లార్వా మందులు చల్లించటం, ప్రజల్ని చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని చెప్పాలని, అదేవిధంగా దోమల బారిన పడకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలని తెలియచేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంఓ రవీంద్ర, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ధనుష్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగి రాజేశ్వరరావు దంపతులకు సత్కారం



సత్తెనపల్లి: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఉద్యోగి అరవ రాజేశ్వరరావు గత 31 సంవత్సరాలుగా పని చేస్తూ శుక్రవారం పదవీ విరమణ చెందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ యూనియన్ గౌరవాధ్యక్షుడు కోడిరెక్క దేవదాస్ ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన అరవ రాజేశ్వరరావు దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు, పి.బాబురావు, ఏజెంట్లు డాక్టర్ సుబ్బారావు, ఎం.సీతారామిరెడ్డి, నందం శ్రీనివాసరావు, మాగులూరి చెన్నకేశవులు, ఎం.నాగరాజు, లోకయ్య, నాగవర్ధనమ్మ, హనుమంతరావు, నాగేశ్వరరావు, సాంబిరెడ్డి, మందడపు నాగేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాలు

అచ్చంపేట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి మార్చి 31 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు, గొర్రెలకు, మేకలకు గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ శ్వాతీదేవి తెలిపారు. 4, 5 నెలల పెయ్యిదూడలకు బ్రూసెల్లా టీకాలు వేస్తారని చెప్పారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

వైభవంగా మహాలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దేవాలయం



తిరునాళ్లలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నాయకులు

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో మహాలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. భక్తులు పొంగళ్లు చేసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం గ్రామస్తులు కుంకు బళ్ల కట్టుకుని ఊరేగింపుగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామం పాడిపంటలతో శోభిల్లాలని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అంగళ్లు సందడి చేశాయి.

అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే నంబూరు పూజలు

మహాలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా కలసిమెలిసి తిరునాళ్ల జరుపుకోవడం సంతోషకరమన్నారు. మాజీ ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి ప్రసాదరెడ్డి, సర్పంచ్ చిమటా మాధవి, వెంకట సైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ అక్కల వెంకట్రామిరెడ్డి, నాయకులు మర్రి బ్రహ్మారెడ్డి, అన్నపరెడ్డి నర్సిరెడ్డి, మేళం కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు



సత్తెనపల్లిలో విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్లు



విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్స్

సత్తెనపల్లి: ప్రపంచ టైలర్స్ డే వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెంకటరమణ హోటల్ సెంటర్‌లో సీనియర్ టైలర్ షేక్ సైదా ముందుగా కుట్టుమిషన్ కనిపెట్టిన విలియం హోవె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విలియం హోవె టైలర్స్‌కి ఏ విధంగా ఉపయోగపడ్డారో వివరించారు. రెడీమేడ్ వస్త్రాలు రావడంతో టైలరింగ్ వ్యవస్థ ఎంతగా కుంటు పడిందో తెలిపారు. ప్రభుత్వం చేతి వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న టైలర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టైలర్లు రాంబాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

పెదకూరపాడు: మండల నేతాజీ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. టైలర్స్ సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం అని పెదకూరపాడు మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి అన్నారు. వారి వెంట ప్రధాన కార్యదర్శి నందిగామ రమేష్, ఉపాధ్యక్షుడు పఠాన్ అయుబ్, కార్యవర్గ సభ్యులు సూరేపల్లి నాసరయ్య, కాలవ నాగేశ్వరరావు, ఎస్కే సుభాని, నాగుల్ మీరా పాల్గొన్నారు.

అచ్చంపేటలో టైలర్స్ డే

అచ్చంపేట: మండలంలోని టైలర్స్ అంతా అచ్చంపేటలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ యూనియన్ సభ్యులు అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. టైలర్స్ పితామహుడు ఇలియాస్ హోవే చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కుట్టుమిషన్లనే నమ్ముకున్న తాము రెడీమేడ్ దుస్తుల వల్ల ఎంత నష్టపోతున్నామో వివరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సందెపోగు గాంధి, తిరువాయిపాటి ఆంజనేయులు, నందిగం ఆశీర్వాదం, గంధం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దర్జీలకు సత్కారం

సత్తెనపల్లి: అంతర్జాతీయ దర్జీల దినోత్సవం పురస్కరించుకొని సత్తెనపల్లి వాసవీ క్లబ్ మణికంఠ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ కనిపెట్టిన విలియం హోవేని స్మరించుకున్నారు. అనంతరం పురుష, మహిళా దర్జీలను వేర్వేరుగా సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ మణికంఠ బాధ్యులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ చట్టాలు అమలు



ఎస్ఐ నాగేంద్రరరావు

క్రోసూరు: కొత్త వాహన చట్టం ప్రకారం శనివారం నుంచి ట్రాఫిక్ చట్టాలు అమలులోకి వస్తాయని ఎస్ఐ నాగేంద్రరరావు శుక్రవారం తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు, బీమా, హెల్మెట్ కలిగి ఉండాలని, అలా లేకుంటే అధిక జరిమానాలు వసూలు చేయబడతాయని చెప్పారు. అనగా రూ.150 స్థానంలో రూ.500 జరిమానా ఉంటుందన్నారు. అదే విధంగా డ్రంక్‌స్ డ్రైవ్, మైనర్లు వాహనాలు నడిపితే మరింత కఠిన చర్యలు, జరిమానాలుంటాయని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించరాదని కోరారు.

పదవీ విరమణ పొందిన ఎంపీడీవోకు సత్కారం



ముప్పాళ్ళ: మండల పరిషత్ అభివృద్ధి అధికారి పీజే విలియమ్స్ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. స్థానిక రైతు భరోసా కేంద్రంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ భవానిశంకర్, రాజుపాలెం ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాదు, సిబ్బంది పాల్గొని విలియమ్స్, దీవెన వినోదిని దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీవో దంపతులను ఘనంగా సన్మానించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.కాశయ్య

ముప్పాళ్ళ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నకరికల్లు ఎంపీడీవోగా పని చేస్తున్న జి.కాశయ్య వ్యవహరించనున్నారు. ప్రస్తుత ఎంపీడీవో పదవీ విరమణ కావటంతో జిల్లా ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా కపోతేశ్వరస్వామి తిరునాళ్ల

నకరికల్లు: దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన చేజర్లలోని కపోతేశ్వరస్వామి తిరునాళ్ల శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల పురస్కరించుకొని అర్చకులు కె.వెంకట్రామయ్యశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవతో పూజాదికారులు ప్రారంభించారు. బలిహరణ, రుద్రహోమం, గ్రామోత్సవం వైభవంగా జరిపించారు. గ్రామోత్సవం లో మహిళలు వార్లు పోసి మొక్కులు చెల్లించారు. భక్తుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల ప్రజలు తిరునాళ్లను తిలకించారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

చిన్నపరెడ్డి సేవలు చిరస్మరణీయం



చిన్నపరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: మండలానికి, తాళ్లచెరువు గ్రామానికి తుమ్మా చిన్నపరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన అచ్చంపేట పీఏసీఎస్ చైర్మన్, తాళ్లచెరువు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మా చిన్నపరెడ్డి అంత్యక్రియల్లో శుక్రవారం శంకరరావు పాల్గొన్నారు. చిన్నపరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. మండలానికి ఒక పెద్ద దిక్కును కోల్పోయామని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎదుగుదలకు ఆయన కృషి అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, నెల్లూరి చంద్రబాబు, గ్రామ కన్వీనర్ బాలశౌరెడ్డి, అచ్చంపేట సర్పంచ్ జాని, మాజీ సర్పంచ్‌లు కంబాల వీరబాబు, సుంకర శ్రీనివాసరెడ్డి, అనుముల సాంబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చర్మకారుల సొసైటీ భూమిని రక్షించండి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో ఆక్రమణకు గురైన చర్మకారుల సొసైటీ భూమిని రక్షించాలని ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్‌ను కోరారు. పలు సంఘాల నాయకులు తహసీల్దార్ కె.పుల్లారావును కలసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేచవరం గ్రామంలోని సర్వే నంబరు 192-6 బి1 నంబర్‌లోని ఒక ఎకరం భూమి 1970లో చర్మకారుల సొసైటీకి కేటాయించబడిందన్నారు. సదరు భూమి ప్రస్తుతం ఆక్రమణకు గురైందని, ఆక్రమణ చేసిన వ్యక్తి తన పేరుపై ఆన్‌లైన్ చేయించుకొని తన కుమారులకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ సదరు భూమిలో రెవెన్యూ శాఖ తరఫున బోర్డు ఏర్పాటు చేస్తామని, చర్యలు తీసుకుంటామని అన్నారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకడావత్ కోటానాయక్, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, పౌరహక్కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నకరికల్లు: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయిన ఘటన మండలంలోని చల్లగుండ్ల సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లగుండ్ల గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాస్ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చల్లగుండ్ల నుంచి ద్విచక్రవాహనంపై నకరికల్లు వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా నకరికల్లు వైపు అతివేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



విజ్ఞాన ప్రదర్శనను పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఇంజనీర్ రాజానాయక్

అచ్చంపేట: జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రగతి పబ్లిక్ యూపీ స్కూల్‌లో శుక్రవారం జరిగిన విద్యార్థుల విజ్ఞాన, వైజ్ఞానిక ప్రదర్శనలు గ్రామస్తులను, తల్లిదండ్రులను ఎంతో ఆకర్షించాయి. ముఖ్యంగా గ్రామాలలో ట్యాంకుల ద్వారా మంచినీటిని ఎలా శుద్ధి చేస్తారు, మినరల్ వాటర్ ఎలా తయారవుతాయి, మూత్రపిండాలు ఎలా పనిచేస్తాయి.. తదితర వాటిని విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. తమ పిల్లలను తీర్చిదిద్దిన పాఠశాల డైరెక్టర్ పి.ఎల్.రాజు, ఉపాధ్యాయులను అభినందించార

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: విద్యార్థి దశ నుంచే శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆర్ అండ్ బీ ఇంజనీర్ ఆర్.రాజానాయక్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అమరావతి పబ్లిక్ పాఠశాలలో అమరావతి సైన్స్ స్పార్క్స్ 2కె25 పేరిట శుక్రవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచే సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా 152 సైన్స్ ఎగ్జిబిట్స్‌తో విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన చేపట్టగా వాటిని పరిశీలించారు. ముందుగా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అమరావతి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సూర్యదేవర శ్రీనివాసరావు విద్యార్థుల విజ్ఞాన నైపుణ్యాలను అభినందించారు. ఆర్ అండ్ బీ డీఈ వెంకట కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రమణాచార్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

జెడ్పీ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు

క్రోసూరు: జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకుని క్రోసూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ కె.నాగేంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఎల్లప్పుడు జిజ్ఞాస, పట్టుదలతో చదువుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో గణేష్, ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి, సైన్సు ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విజ్ఞాన దినోత్సవం

సత్తెనపల్లి: సముద్రపు నీరు నీలి రంగులో ఉండటానికి కారణంపై పరిశోధన చేసి 1930లో ఆసియా ఖండంలో విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ అని స్వామి వివేకానంద చైతన్య భారతి సంస్థ సభ్యుడు జేపీఎస్ శాస్త్రి అన్నారు. నోబెల్ గ్రహీత డాక్టర్ సీవీ రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన రోజును జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నామని, దీనిలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌వీబీసీ సభ్యుడు అబ్బూరి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంస్థ ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు, విశ్రాంత ఉద్యోగులు మురహరరావు, న్యాయవాది పూజల వెంకట కోటయ్యలు మాట్లాడారు. సీవీ రామన్ చిత్రపటానికి, అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. సభ్యులు పాల్గొన్నారు.

బాలెమర్రు(క్రోసూరు): జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకుని నరసారావుపేట శంకర భారతిపురం జెడ్పీ పాఠశాలలో 4, 5 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఈవీఎస్, మ్యాథ్స్ సబ్జెక్టులలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలం బాలెమర్రు గ్రామంలోని ఎంపీపీ పాఠశాల(ఎస్‌డబ్ల్యూటీ) విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు హెచ్ఎం శరత్ శుక్రవారం తెలిపారు. ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు కనమళ్ల సాంబశివరావు, రాకేష్‌లను అభినందించినట్లు తెలిపారు.

కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



మాట్లాడుతున్న పీడీఎం రాష్ట్ర నాయకుడు

నకరికల్లు: దేశ విముక్తి కోసం కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు అన్నారు. కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సభను స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. సభకు పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, భారత్ బచావో నాయకులు కోలా నవజ్యోతి, పౌరహక్కుల సంఘం నాయకులు వినుకొండ పేరయ్య, శిఖనం చిన్న, ఎంసీపీఐయూ మహిళా విభాగం అధ్యక్షులు గాదె కుమారి, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సామాజిక కార్యకర్త గఫూర్, గిరిజన హక్కుల ఐక్యవేదిక నాయకులు శ్రీనునాయక్ పాల్గొన్నారు.

అంకిత భావంతో చేసే సేవలు ఎప్పటికీ మరువలేం

ఎంఈవో-1 శ్రీనివాసరావు



హెచ్ఎం ఖాదర్ మస్తాన్‌ను సత్కరించిన ఎంఈఓలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకితభావతో పని చేసే ఉపాధ్యాయుల సేవలు ఎప్పటికీ మరువలేమని మండల విద్యాశాఖాధికారి-1 అనంతవరం శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక (ఎస్ఆర్‌బీఎస్) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్ మస్తాన్ పదవీ విరమణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి పాఠశాల పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఎం ఖాదర్ మస్తాన్ విధి నిర్వహణలో ఏ పని చేయటానికైనా ముందుంటారని, ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి పాఠశాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారన్నారు. మండల విద్యాశాఖాధికారి-2 ఎ.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగంలో పదవీ విరమణ తప్పదన్నారు. పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ ఏడుకొండలు మాట్లాడారు. హెచ్ఎం ఖాదర్ మస్తాన్ సహకారంతోనే త్వరితగతిన పాఠశాల భవన నిర్మాణం జరిగిందన్నారు. పాఠశాల ఉపాధ్యాయినులు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు ఖాదర్ మస్తాన్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల కోసం చెరువు ఖాళీ

అనుమతి లేదంటున్న పంచాయతీ అధికారులు



లంకెలకూరపాడులో చేపలు పడుతున్న కూలీలు

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): పంచాయతీ అనుమతులు లేకుండానే చేపల కోసం మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో చెరువును ఖాళీ చేశారు. గ్రామంలో మొత్తం 20 ఎకరాల్లో చెరువులు ఉన్నాయి. అందులో 8 ఎకరాల్లో మంచి నీటి చెరువు కాగా, మరో 12 ఎకరాల్లో రెండు భాగాలుగా విభజించిన చేపల చెరువులు ఉన్నాయి. రెండేళ్ల క్రితం చేపల పెంపకం కోసం చేపల చెరువులకు వేలం నిర్వహించగా అదే గ్రామానికి చెందిన పల్లె శివప్రసాదరెడ్డి 2 సంవత్సరాలకు చేపల పెంపకం కోసం పాడుకున్నారు. ఆ మేర సొమ్మును పంచాయతీకి జమ చేశాడు. ఒక ఏడాది చేపలు పట్టుకున్నాడు. గత ఏడాది జూన్‌తో వేలం గడువు ముగిసింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో చేపలు పట్టుకోలేదు. రెండు రోజుల నుంచి చేపలు పట్టుకునేందుకు చెరువును ఖాళీ చేస్తున్నాడు. అయితే గడువు ముగిసిందని, పట్టుకోవడానికి వీల్లేదని పంచాయతీ సర్పంచ్ వర్గీయులు అడ్డుకున్నారు. అయినప్పటికీ చేపలు పట్టేందుకు ఉపక్రమించడంతో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ విస్తరణాధికారి రూపవతి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రమేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేపల పట్టడాన్ని తాత్కాలికంగా నిలిపి వేయించారు. శివప్రసాదరెడ్డి కూడా చెరువులో చేపల పెంపకం కోసం వేలంలో దక్కించుకున్నానని పంచాయతీ తీర్మానం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఈఓపీఆర్డీకి ఫిర్యాదు చేశాడు.

గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు



ప్రజలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తులసి

క్రోసూరు: క్రోసూరు ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మండలంలోని బంగారు తండా, సంద్ర తండాలలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటు సారా తయారీదారులు, విక్రయదారులు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత కేసులున్న ముద్దాయిలందరినీ బైండోవర్ చేయడం జరిగిందన్నారు. నాటు సారా తాగడం వలన జరిగే అనర్థాలపై తండా ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. అత్యధిక కేసులు నమోదైన వారిపై పీడీ యాక్ట్ చట్టం కింద చర్యలు తీసుకోబడతాయని అన్నారు. కాబట్టి సారా తయారు చేయవద్దు, కేసులు జోలికి పోవద్దని అవగాహన కల్పించారు.

నేటి నుంచి దేవరంపాడు కొండ తిరునాళ్ల

రాజుపాలెం: జిల్లాలో పల్నాటి తిరుపతిగా వెలుగొందుతున్న దేవరంపాడు కొండ తిరునాళ్ల శనివారం నుంచి మార్చి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఐదు శనివారాలు నిర్వహించనున్న ఉత్సవాలు ఉగాదితో ముగుస్తాయి. మత్స్యరూపంలో దర్శనమిచ్చే వెంకటేశ్వరుడికి భక్తులు మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేస్తారు. ఏటా ఫాల్గుణ మాసం మొదటి శనివారం ఈ తిరునాళ్ల ప్రారంభమవుతుంది. తిరునాళ్లకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతారని, వారికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ గణపతి సురేష్ తెలిపారు.